# ఎన్. జీ. వో. భార్య

కుర్చీలో కూచున్నాడు జగన్నాథం. అతని మొహంలో చిర్నవ్వు లేదు. కళ్ళల్లో వెలుగులేదు. కాళ్ళల్లో సత్తువలేదు. ఎండిపోయిన తోట కూరకాడలా వాడిపోయాడతను.

ఒకప్పుడతను చాలా అందంగా నవ్వేవాడు. ఒకప్పుడతని కళ్ళల్లో వెలుగుండేది. కాళ్ళల్లో సత్తువుండేది. ఏపుగ ఎదిగిన మొక్కలా వుండే వాడతను.

మొక్కయి వంగనిది మానయి వంగుతుందా - అన్నది సామెత కానీ అతను మొక్కగా వున్నప్పుడు వంగలేదు. పూర్తిగా మానయిన తరువాతయినా వంగలేదు. మొక్కకీ మానుకీ మధ్య దశలో వంగిపో యాడు.

మళ్ళీ లేచి నిటారుగ నిలబడాలని ఊహ। చాలా గొప్పగా బతికే యాలని ఆశ।। తను, భార్య, పిల్లలు భోగభాగ్యాలతో తులతూగిపోవాలని ఆకాంక్ష।।।

కాని—

చేటలో బియ్యం పోసుకుని కూచున్న అయిలక్ష్మి కిలాటి ఆలోచ నలు లేవు. ఆమె ఆలోచన ఒక్కటే.

'రేపెలా గడుస్తుంది!'

ఏ ఆలోచన ఉన్నా పరవాలేదు కాని - రేపెలా గడుస్తుందనే ఆలోచన మాత్రం మనిషి కుండకూడదు. ఆ ఆలోచన మనిషి కొచ్చిందంటే మనిషి మనిషిలాగ బతకటం లేదన్నమాట.

ఒకప్పుడు జయలక్ష్మి, జగన్నాధం అన్యోన్యంగా వుండేవారు. జయలక్ష్మి కిష్టమైన మల్లెపూలు తెచ్చేవాడు జగన్నాధం. జగన్నాధాని కిష్టమైన వంటకాలు చేసేది జయలక్ష్మి.

ఇప్పుడు జయలక్ష్మి, జగన్నాధం అన్యోన్యంగా వుండలేకపోతు న్నారు. జయలక్ష్మి కిష్టమైన మల్లెపూలు లేవు. జగన్నాధాని కిష్టమైన కూరలు లేవు.

అప్పుడు శుక్లపక్ష చంద్రుడిలా త్వరగా ఇంటికి వచ్చేవాడు జగన్నాధం. ఇప్పుడు కృష్ణపక్ష చంద్రుడిలా ఆలస్యంగా ఇంటికి వస్తున్నాడు.

అమావాస్యనాడు చంద్రుడుదయించడు. ఒక్కొనాడు జగన్నాధం ఇంటికి రాడు.

ఉండలేక అడుగుతుంది జయలక్ష్మి. 'నిన్న ఇంటికి రాలేదేం?'

'ఆఫీసులో పని చాలా ఎక్కువగా వుంది.'

ఇంక మాటలు లేవు. మామూలు రొటీన్.

'చంటిదానికి పాలడబ్బా కావాలి.'

'రోజూపోసే పాలమ్మాయికి డబ్బివ్వాలి.'

'ఎడపిల్లాడి జ్వరానికి మందుకావాలి.'

'ఇంటాయనకి డబ్బివ్వాలి'— వంటచేస్తూ ఆలోచన. ఏదోచేస్తూ ఆలోచన। ఆలోచిస్తుంటే, ఆలోచనలో ఆలోచన।

ఈగల్లాటి ఆలోచనలు. ముసురులా తెరపిలేని ఆలోచనలు.

"వంట పూర్తయింది."

జగన్నాథం వచ్చాడు. అన్నం తిన్నాడు. ఆఫీసు కెళ్ళాడు.

అసలు మనసుని పిచ్చి ఊహలు అలముకోకనే పోవాలి. అలముకుంటే ఒకపట్టాన వదలవు. ఆ వూహల తాకిడికి బుర్ర వేడెక్కి భూతకాలం తీయగానూ, వర్తమానం వగరుగానూ, భవిష్యత్తు చేదుగానూ అనిపిస్తుంది.

అదే జరిగింది జయలక్ష్మి విషయంలోనూ. అందుకే కడుపులో ఆకలి మండుతున్నా వండుకున్న అన్నం తినలేకపోయింది.

"మగవాళ్ళను వేయికళ్ళతో కనిబెట్టుకుని వుండాలి. వాళ్ళు ఆఫీసుకి వెడుతున్నారో లేదో, వెళ్ళినా ఎంతసేపుంటున్నారో అన్నీ స్వయంగా తెలుసుకుంటూండాలి"— రామలక్ష్మిగారి మాటలు గుర్తొచ్చాయి జయలక్ష్మికి. ఆ తర్వాత ఆ మాటలే పదే పదే వినిపించాయి చెవులకి.

ఏమైనాసరే, జగన్నాధాన్ని కనిబెట్టాలనుకుంది జయలక్ష్మి. పెళ్ళయిన తర్వాత ఒకరోజు జగన్నాధం జయలక్ష్మిని ఆఫీసుకు తీసుకెళ్ళాడు. తన సీటు వగయిరాలన్నీ చూపించాడు. మధ్యలో రెండుమూడు సార్లు సెక్షన్‌లు మారినా, ఇప్పుడు పాత సెక్షన్‌లోనే వుంటున్నాడు జగన్నాధం. ఆ విషయం అతనే చెప్పాడు కూడాను.

ఒక నిశ్చయానికి వచ్చింది జయలక్ష్మి—

"ఒరేయ్ సుబ్బూ! మీనాన్న వస్తే సీతారావమ్మ గారింటికి ఏదో పేరంటంవుంటే వెళ్ళింది - అని చెప్పు। ఒక గంటలో వచ్చేస్తా! ఇల్లు జాగ్రత్త!!" పెద్ద వెధవకి పురమాయించి తలుపు తీసింది జయలక్ష్మి.

ఎదురుగా జగన్నాధం.

ఉలిక్కిపడింది జయలక్ష్మి.

నివ్వెరపోయాడు జగన్నాథం.

సర్దుకుంది జయలక్ష్మి. 'రండి లోపలికి. అక్కడే నిలబడి పోయారేం?'

'ఎక్కడికో ప్రయాణమైనట్టున్నావ్?'

"ప్రయాణమా, నా మొహమా? గాలాడక చస్తూ తలుపు తీశానంతే! ఇంతలో మీరు — పదండి భోంచేద్దురుగాని" తలుపేస్తూ అంది జయలక్ష్మి.

జగన్నాథం మాట్లాడలేదు.

జయలక్ష్మి మాట్లాడదలచుకోలేదు.

ఏ కళనున్నాడో సుబ్బు - జయలక్ష్మి పెద్ద వెధవ - వాడూ మాట్లాడలేదు.

ఆరోజు గడిచిపోయింది.

ఆ మర్నాడు జగన్నాథం ఆలస్యంగానే వచ్చాడు. కానీ జయలక్ష్మికి ధైర్యం చాలలేదు — జగన్నాథం ఆఫీసు కెళ్ళటానికి.

'ఆలస్యమయిందేమండి?' అడిగింది జయలక్ష్మి.

'ఆఫీసులో వర్క్ ఎక్కువగా వుంటోందని చెప్పానుగా!' మళ్ళీ చెప్పాడు జగన్నాథం.

చిన్న చేపని మింగిన పెద్దచేపలాగ నేటును తినేసింది రేపు. అది చాలదన్నట్టు తాను నేడయిపోయింది.

ఆ రోజు—

జయలక్ష్మి జీవితంలో మొదటిసారి భర్తమీద ఆరాతీసిన రోజు.

మళ్ళా సుబ్బుని పిలిచి, 'మీనాన్న వస్తే సీతారావమ్మగారింటికి పేరంటం వుంటే వెళ్ళింది అమ్మ—అన్చెప్పు' అంది.

ప్రొఫెసరుగారో ఆయనెవరో రాసుకుంటూ రాసుకుంటూ మధ్యలో ఆగి, "ఎవరూలేరు పిల్లలే!'' అన్నాడట. అది నాల్రోజుల క్రితం ఆయన భార్య ''ఏమిటండీ ఆ గొడవ''? అన్నదానికి జవాబట.

సరిగ్గా అలావుంది సుబ్బుగాడి వ్యవహారం. పేరంటం వుందని చెప్పి మొదటి రోజు వెళ్ళక పోయినా అడగలేదు. కాని, ఈ రోజు అడిగాడు "ఆరోజేనన్నావుగా, పేరంటం! నువ్వెప్పుడెడితే అప్పుడిస్తారేంటి వాళ్ళు?"

''అవాళ ఏదో అవాంతరం వస్తే ఇవాళకు మార్చారు. వెధవ్వేషాలేయక మీ నాన్నవస్తే నే చెప్పినట్టు చెప్పు!" అంది.

అలా అబద్ధంచెప్పి జగన్నాధం ఇంట్లోబైల్దేరిన జయలక్ష్మి, జగన్నాధం ఆఫీసు ఆవరణ చేరుకుంది. చేరుకున్నదన్న మాటేగాని ఒకటే బెరుకు బెరుకుగా వుందిమనసు. భర్త తప్పు చేస్తున్నాడో లేదో తెల్సుకునేందుకు తను తప్పు చేస్తున్నానేమోనని భయపడింది.

'ఈ పళంగా భర్త ఎదురైతే ఏంచేస్తావ్?' ప్రశ్నించింది అంతరాత్మ.

'భయంలేదు. నడు! నువ్‌చేస్తున్నది తప్పుపని కాదు' వెన్నుతట్టింది మరో మనస్సు.

అదొక రకమైన స్థితిలో, తెచ్చిపెట్టుకున్న ధైర్యంతో ఆఫీసులో అడుగు పెట్టింది జయలక్ష్మి.

నైట్ వాచర్‌లావుంది, శుభ్రంగా నిద్రోతున్నాడు—

దేదీప్యమానంగా వెలుగుతున్నాయి లైట్లు. పోటీ పడినట్లు తిరుగుతున్నాయి ఫ్యాన్లు.

ఆయన సీటు తనకు బాగా గుర్తు—

ముందుగా అటొకసీటు, ఇటొకసీటు, అవి ఖాళీగా ఉన్నాయి. తర్వాత సన్నటిదారి. అది కుడిపక్కకి తిరుగుతుంటే హాలు. హాలులో పది పన్నెండు సీట్లు. అందులో మొదటిది జగన్నాధం సీటు.

సన్నటి దారి చప్పుడుకాకుండా నడిచేసి, కుడిపక్కకి తిరగకుండా తొంగిచూసింది జయలక్ష్మి, తగిన జాగ్రత్త తీసుకుంటూ. ముందు సీట్లో పెన్ను చేత్తో పట్టుకొని. ఆ చేతిని గడ్డంకింద పెట్టుకుని ఆలోచిస్తున్నాడు జగన్నాధం. (పాపం! ఏ ఫైల్ను గురించో!)

ఇద్దరు ముగ్గురు గుమాస్తాలు కూడ అదే స్థితిలో వున్నారు. గిరుక్కున వెనక్కి తిరిగింది జయలక్ష్మి. గబుక్కున ఇంటికి వచ్చి పడింది. ముందు తనను తాను తిట్టుకుంది. భర్తను అనుమానించటం మహానేరమనుకుంది. తర్వాత రామలక్ష్మిగారిని తిట్టింది — ఆవిడ మాటల వల్లనే తనీలాటి పనిచేసిందని. నయమే! ఆయన చూడలేదు కాబట్టి సరిపోయింది. చూస్తే ఏమయ్యేది తన పని?

ఆరాత్రి జగన్నాధం పదకొండున్నరకి ఇంటికి వచ్చాడు. ఓపిగ్గా తలుపు తీసింది జయలక్ష్మి. అతను వద్దంటున్నా వినకుండా ప్రేమగా అన్నం పెట్టింది.

ఆరోజే కాదు, ఆ తర్వాత కూడ అలాగే నడుచుకుంది. దారిద్ర్యాన్ని తిట్టుకోవాలిగాని, భర్తను తిట్టుకోకూడదనుకుంది. ఎలాగోలాగ నాల్రోజులకోసారయినా భర్త కిష్టమైన కూరలు చెయ్యాలనుకుంది జయలక్ష్మి.

* * * *

నిజంగా పిచ్చిది జయలక్ష్మి. ఆంధ్రదేశంలో పుట్టిన చదువుకోని ఆడది ఆమె. ఆఫీసులో భర్తనయితే చూసింది కాని, ఆ భర్త ఏం చేస్తున్నాడనేది చూడలేదామె.

ఆరోజు ఆఫీసులో జగన్నాధం బుర్రబద్దలు కొట్టుకుంటూ ఆలోచించేది ఫైల్ గురించి కాదని, ఆ మర్నాడు జరగబోయే గ్వ్రాండీరేసెస్‌లో జాక్‌పాట్ గురించనీ తెలీదు జయలక్ష్మికి.

ఆమాటకొస్తే జయలక్ష్మికి తెలీనివి ఇంకా చాలా వున్నాయి. లంచ్ అవర్‌లో సీటుల్లో ఎవరూ వుండక పోయినా అన్ని ఆఫీసుల్లోనూ లైట్లన్నీ వెలుగుతూనూ, ఫ్యాన్లన్నీ తిరుగుతూనూ ఎందుకుంటాయో ఆమెకు తెలీదు.

వాళ్ళాయన పిల్లలకు తీసుకువచ్చే తెల్లకాగితాలు, పెన్సిళ్ళు ఎక్కడవో ఆమెకు తెలీదు.

ఆఫీసు జీపుల్లోనూ, కారుల్లోనూ పెళ్ళాల నేసుకుని ఆఫీసర్లు సినిమాలకు, షికార్లకు ఎందుకు తిరుగుతారో ఆమెకు తెలీదు.

కరెంటు సప్లయి సరిగ్గాలేదని గోలపెడుతున్నా, వాళ్ళ కాలనీలో రాత్రి వెలిగిన వీధి దీపాలు పగలు పన్నెండయే వరకూ ఎందుకు వెలుగుతాయో ఆమెకు తెలీదు.

నిజానికి—

జయలక్ష్మికి తెలీని విషయాలు చెప్పాలంటే చాలా చెప్పాలి. తెలీని విషయాల సంగతెలావున్నా, ఆమె బొత్తిగా ఆలోచించలేని విషయాలు కొన్ని వున్నాయి.

గుర్రప్పందాలకు సామాన్యులను రాకుండా ప్రభుత్వం ఎందుకు నిషేధించదో జయలక్ష్మి ఆలోచించలేదు.

అలా నిషేధించటం సాధ్యం అవుతుందో అవదో జయలక్ష్మి ఆలోచించలేదు.

సామాన్యులు కూడ అసామాన్యుల (సోకాల్డ్ పెద్దమనుషుల)తో బాటు అవంటే ఎందుకు పడిచస్తారో జయలక్ష్మి ఆలోచించలేదు.

కేవలం అయిదు రూపాయల పెట్టుబడితో లక్షలు సంపాదించాలని ప్రజలెందుకనుకుంటారో ఆమె ఊహకు బొత్తిగా అందని విషయం.

కాని—

ఆమెకు ఆలోచనలున్నాయి. ముసురులా తెరపిలేని ఆలోచనలు. ఆమె ఆలోచించగలదు - భర్త గురించి, పిల్లల్ని గురించి, రేపు గురించి.

పాపం! జయలక్ష్మి భారతదేశంలో ఒక ఎన్. జీ. వో. భార్య.